క్లుప్తంగా

ఆటలకు మైదానం సిద్ధం


క్రీడా ప్రాంగణంలో శుభ్రం చేయిస్తున్న నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద క్రీడా మైదానాన్ని ఆటలకు అనుకూలంగా వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధం చేశారు. పార్టీ నాయకులు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు, మళ్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో మైదానంలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రత్నమాల, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా కాలువ నిర్మాణం


శ్రీరామ్‌నగర్ వద్ద కాలువ నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీరామ్‌నగర్ వద్ద పెద్ద కాలువ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ కాలువ శిథిలం కావడంతో వ్యర్థాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. దీంతో మురుగునీరు ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. దీంతో గ్రామస్తులు కార్పొరేటర్ గులిగిందల లావణ్య దృష్టికి ఈ సమస్యను ఇటీవల తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన ఆమె జీవీఎంసీ ఇంజినీరింగ్ వర్క్స్ అధికారులకు సమస్య వివరించి, కాలువ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు కార్పొరేటర్‌కు అభినందనలు తెలిపారు.

ధ్యానంతో ప్రశాంతత

మల్కాపురం : ధ్యానం ఒత్తిడిని తగ్గిస్తుందని, నిత్యం చేస్తే ప్రశాంతంగా ఉంటారని బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధి సింధూ సిస్టర్ అన్నారు. జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురంలోని బ్రహ్మకుమారి సంస్థ ధ్యాన మందిరంలో ధ్యానం, యోగాసనాలపై స్థానిక మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతటి పని ఒత్తిడిలో ఉన్నా రోజూ 30 నిమిషాలు ధ్యానం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆసనాలు వేస్తే ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.

శరత్‌బాబుకు ఘన నివాళి


శరత్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం కళా సేవా పీఠం కార్యాలయంలో ప్రముఖ సినీనటుడు శరత్‌బాబు చిత్రపటానికి మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళా సేవా పీఠం వ్యవస్థాపకుడు నందవరపు సోములు మాట్లాడుతూ నటనలో ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి శరత్‌బాబు అని కొనియాడారు. కళా సేవా పీఠం అధ్యక్షుడు కొరకల రామదాసు మాట్లాడుతూ శరత్ బాబు కళా రంగానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఉత్తరాంధ్ర నటుడు ఈ స్థాయికి చేరుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో చందు సుబ్బారావు, గంపల అప్పారావు, సింహాచలం నాయుడు, గంపల అప్పారావు, భాస్కర్ పాణిగ్రాహి, ఆళ్ల నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

మెషీన్ లెర్నింగ్‌పై ఎఫ్‌డీపీ

కొమ్మాది: మెషీన్ లెర్నింగ్‌పై అధ్యాపకులు, పరిశోధకులకు అవగాహన కల్పించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగాం (ఎఫ్‌డీపీ) మంగళవారం ప్రారంభమైంది. ఐఐటీ గౌహతితో కలిసి నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రొఫెసర్ డా. త్రివేది మాట్లాడారు.

గిరి ప్రదక్షిణ సజావుగా సాగేలా..


సుసర్ల కాలనీ వద్ద రహదారి పక్కన ఆక్రమణలను తొలగిస్తున్న జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు


కుమారి కల్యాణ మండపం ఎదురు రోడ్డులో సాగుతున్న పనులు

గోపాలపట్నం: ఈ నెల 2వ తేదీన జరిగే గిరి ప్రదక్షిణ సజావుగా సాగేలా ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జీవీఎంసీ అధికారులు రహదారుల అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కుమారి కల్యాణ మండపం నుంచి సుసర్ల కాలనీ వరకు ఉన్న రహదారిపై ఆక్రమణలను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ అధికారులు సంయుక్తంగా తొలగింపు చర్యలు చేపట్టారు. జోన్-8 ఏసీపీ జయరాం, టీపీవో ప్రేమ్‌కుమార్, గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ పనులు బుధవారం కూడా కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఏసీపీ జయరాం మాట్లాడుతూ ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. గిరి ప్రదక్షిణలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం తగదు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ
- 91, 92 వార్డుల్లో విస్తృత పర్యటన


మేహాద్రి గెడ్డ వద్ద పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91,92 వార్డుల్లో కమిషనర్ సాయికాంత్‌వర్మ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. జీవీఎంసీ 92వ వార్డు పరిధి వెంకటాపురం, కంపరపాలెం, మేహాద్రి గెడ్డ ప్రాంతాలను ఆయన జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు కలిసి పరిశీలించారు. వెంకటాపురం రైల్వే బ్రిడ్జి దిగువ రహదారిని అభివృద్ధి చేయాలని బెహరా కోరారు. వెంకటాపురం నుంచి కొత్తపాలెం వెళ్లే రహదారి, మేహాద్రి గెడ్డ మీదుగా నరవకు రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు. వెంకటాపురం, కంపరపాలెం ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా ఉండడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. నిర్ణీత సమయానికి క్లాప్ వాహనాలతో ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయాలని ఆదేశించారు. గోపాలపట్నం నుంచి సింహాచలం వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి గిరిప్రదక్షిణకు అనువుగా తీర్చిదిద్దాలని కమిషనర్ సిబ్బందికి సూచించారు. ఇక్కడి ఇందిరానగర్‌లో చేపట్టిన రహదారి పనులను పరిశీలించారు. కంపరపాలెం పార్కును ఆధునీకీకరించాలని, వెంకటాపురం శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని, నరవ గెడ్డ ఆధునీకీకరణ, తదితర పనులను కమిషనర్ దృష్టికి బెహరా భాస్కరరావు తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన దశల వారీగా పనులు చేపడతామని హామీ ఇచ్చారు. జెడ్సీ మల్లయ్యనాయుడు, పర్యవేక్షణ ఇంజినీర్ రామ్మోహనరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ సంతోషికుమారి, ఏఎంహెచ్‌వో రాజు, స్థానిక వైఎస్సార్ సీపీ 92వ వార్డు అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామినాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు గేదెల మురళీకృష్ణ, గొంతిన నాగరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'అమ్మఒడి'


అమ్మఒడి పథకం బయోమెట్రిక్ ప్రక్రియను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: అర్హులందరికీ అమ్మఒడి పథకం వర్తిస్తుందని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఏకేసీ కాలనీ సచివాలయంలో లబ్ధిదారులకు బయోమెట్రిక్ వేసే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అమ్మఒడి పథకం అర్హుల జాబితాలో పేర్లులేని వారిని గుర్తించి, వెంటనే వారికి ఏ కారణం చేత జాబితాలో పేరు లేదో తెలియజేయాలన్నారు. అనంతరం వారికి పరిష్కరించే మార్గాన్ని కూడా సూచించి పథకం వర్తింపజేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. పేదలకు చదువు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకంతో పాటు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, తదితర పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో వార్డును మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు రాజాబాబు, సత్తిబాబు, సోయల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ మేలు


సచివాలయంలో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు


టిడ్కో గృహాల అనర్హులకు చెక్కులు అందిస్తున్న 62వ వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు

గోపాలపట్నం: ప్రభుత్వ పథకాలు అందరికీ అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, దీన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు కోరారు. ఈ మేరకు సుసర్ల కానీలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 471, 472వ నంబరు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందివ్వాలని సూచించారు. ఇందులో గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు కీలకంగా వ్యవహరించాలని కోరారు. ప్రతీ ఒక్కరూ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు, వారి ఇబ్బందులు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్ గేదెల మురళీ కృష్ణ, చుక్క పైడిరాజు రెడ్డి, దేరెడ్ల సత్యనారాయణ రెడ్డి, తాతారావు, ఆర్‌పీలు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ 90వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లారు. ప్రజల అవసరాలు, సమస్యలు తెలుసుకున్నారు. ఆ వివరాలు నమోదు చేసుకున్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

సింధియా : జగనన్న సురక్ష కార్యక్రమంపై జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురం సచివాలయ సిబ్బందితో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో ముఖ్యమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు అర్హులై ఉండి పథకాలు అందని వారి సమస్యలు తక్షణమే పరిష్కరించే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. జూలై 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. సచివాలయ పరిధిలో ఉన్న అర్హులందరికీ వలంటీర్లు జగనన్న సురక్ష పథకం ఉద్దేశాన్ని వివరించి, వారి సమస్యలు పరిష్కరించడంతోపాటు అవసరమయ్యే ధ్రువీకరణ పత్రాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సత్యనారాయణ, చంటి, కమలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్ - 4 సచివాలయ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో అనర్హులకు గృహాలు కేటాయించడంతో సమగ్ర దర్యాప్తు జరిపిన ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డీడీలు కట్టిన వారికి చెక్కులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, సచివాయల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల సూచనలు అవసరం


సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు


మాట్లాడుతున్న గోపాలపట్నం బాలికల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్తేర్ హెప్సిబా

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్, గోపాలపట్నం ప్రాంతాల్లో ఉన్న పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్‌ఎం ఎస్తేర్ హెప్సిబా సమావేశమయ్యారు. ఈ నాలుగేళ్లలో పాఠశాలల్లో వచ్చిన మార్పుల గురించి వివరించారు. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వం పాఠశాలను అభివృద్ధి చేసిందన్నారు. ప్రతి తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సూచనలు, సలహాలు విద్యార్థుల తల్లిదండ్రులు తెలియజేయాలన్నారు.

గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు నిరంతరం పని చేస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులు ఏమి చదువుతున్నారో దృష్టి పెట్టాలన్నారు. కొత్తపాలెం, యల్లపువానిపాలెం పాఠశాలల్లో కూడా తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు జరిగాయి.

దేవీపురంలో ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు


పూజలందుకుంటున్న వారాహి అమ్మవారు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిసాయి. ఈ రోజు చివరిరోజు కావడంతో ముగింపు కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుండి వారాహి ఉత్సవమూర్తికి భక్తులు క్షీరాభిషేకాలు, కుంకుమ పూజలు జరిపించారు. ఆరోగ్య పరిరక్షణకు శ్రీయంత్ర మహామేరుకు, ఆగ్నేయ దిశలో ఉన్న వారాహి అమ్మవారికి భక్తులు స్వయంగా క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారాహి సహస్ర నామావళి పారాయణ, వారాహి హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

1న 'నాన్న నీ మనసే వెన్న' కార్యక్రమం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: వాత్సల్య బాంధవ్యంగా నాన్న నిలుస్తారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. తన్మయి క్రియేషన్స్ ఆధ్వర్యంలో వచ్చే నెల 1న నిర్వహించనున్న 'నాన్న నీ మనసే వెన్న' కార్యక్రమం పోస్టర్‌ను వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఫాదర్స్ డేను పురస్కరించుకుని 143 మంది అతిథులు నాన్న గురించి మాట్లాడేలా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా నమోదు చేస్తారని వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు బి.ఎస్.చంద్రశేఖర్, కార్యదర్శి సి.హెచ్.వి.సత్యనారాయణ, కార్యక్రమ సమన్వయకర్తలు బాదంగీర్ సాయి, ఎస్.నాగేశ్వరరావు, సభ్యులు ఎం.వి.రాజశేఖర్, కె.రాజు, ఎం.హరిమోహన్, జి.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఉన్న రంగసాయి నాటక గ్రంథాలయంలో 1వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెలలో అమృతమయి అమ్మ పేరుతో నిర్వహించిన కార్యక్రమం ఇప్పటికే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది.

'ఉక్కు' ప్రైవేటీకరణను విరమించే వరకు ఉద్యమం

కూర్మన్నపాలెం: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం విరమించే వరకు ఉక్కు ఉద్యమం కొనసాగుతుందని పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 866వ రోజు మంగళవారం పలువురు కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు కార్మిక వర్గం ఎన్నో ఏళ్లుగా శ్రమించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంటును నష్టాల ఊబిలోకి నెట్టేందుకు యాజ మాన్యం ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలకు అభినందనలు


ఆశ కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందిస్తున్న సింధు

మల్కాపురం : కోవిడ్ సమయంలో ప్రజలకు, రోగులకు ఉత్తమ సేవలు అందించిన ఆశ కార్యకర్తలకు బ్రహ్మకుమారి సంస్థ (శ్రీహరిపురం) నిర్వాహకురాలు సింధూ సిస్టర్ మంగళవారం సర్టిఫికెట్లు అందించారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని మరిడిమాంబ కల్యాణ మండపంపైన గల సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కోవిడ్ సమయంలో ఆశ కార్యకర్తలు పారిశ్రామిక ప్రాంతంలో పలువురికి అందించిన సేవలు అభినందనీయమన్నారు. వీరి సేవల వల్ల ఎంతో మంది ప్రస్తుతం ఆనందమయ జీవనం సాగిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

29న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 29న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఘనంగా బంగారమ్మ పండగ


బంగారమ్మ తల్లి


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత బంగారమ్మతల్లి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ప్రియాగార్డెన్స్‌లో ఉన్న అమ్మవారి ఆలయానికి అడవివరం గ్రామస్తులు, భక్తులు విశేషంగా తరలివచ్చి దర్శించుకున్నారు. మహిళలు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. గ్రామ సాంప్రదాయం ప్రకారం రాత్రి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాత అడవివరంలో ఉన్న శతకం పట్టు వద్ద నుంచి అమ్మవారి పూజారి వంశీయులైన లండ కుటుంబ సభ్యులు ఘటాలను శిరస్సుపై పెట్టుకుని ప్రియాగార్డెన్స్‌లో ఉన్న ఆలయానికి చేరుకున్నారు. దారి పొడవునా అమ్మవారికి గ్రామస్తులు హారతులు, పసుపు కుంకుమలు సమర్పించారు. సింహాచలం దేవస్థానం తరఫున ఈవో వి.త్రినాథరావు అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించారు. ఆలయం వద్ద దేవస్థానం తరఫున భక్తులకు ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ట్రస్ట్ బోర్డు సభ్యులు దినేష్‌రాజ్, శ్రీనివాసరావు, శ్రీదేవి అమ్మవారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. దేవస్థానం సూపరింటెండెంట్ లక్ష్మీప్రసన్న ఆలయం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పోలీసుల పహారాలో గంగవరం పోర్టు


గంగవరం పోర్టు వద్ద పోలీసులు, ఇతర సిబ్బంది

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు వద్ద మంగళవారం కూడా పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. పోర్టులో పని చేస్తున్న కార్మికులు తమ వేతనాలను పెంచాలని కోరుతూ చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో పోలీసులు ఇక్కడ బందోబస్తు నిర్వహించారు. పోర్టు నిర్వాసిత కార్మికులు తమ వేతనాల సమస్యపై కలెక్టర్‌తో కలెక్టరేట్‌లో మంగళవారం చర్చలు జరిపారు. అయితే ఈ నెల జీతానికి రూ.10 వేలు కలిపి ఇవ్వడానికి యాజమాన్య ప్రతినిధులు ఒప్పుకున్నారని చెప్పారు. అది కూడా ఈ ఒక్క నెల మాత్రమే ఇస్తామని చెప్పడంతో కార్మికులు దానికి అంగీకరించలేదు. ప్రస్తుతం ఇస్తున్న జీతాలకు రూ.10వేలు కలిపి ప్రతి నెలా ఇవ్వాలని కోరారు. దానికి కలెక్టర్ నిరాకరించడంతో కార్మికులు వెనుదిరిగారు.

ఈ చర్చలు సఫలం కాకపోవడంతో పాటు రెండో రోజు కూడా కార్మికులకు పోర్టు యాజమాన్యం సెలవు ప్రకటించడంతో మరోమారు ఆందోళనలు చోటుచేసుకునే అవకాశం ఉందని ముందస్తుగానే ఇక్కడ పోలీసులను మోహరించారు. అయితే తమకు పూర్తి స్థాయిలో న్యాయం చేసే వరకూ పోరాటాలు చేస్తామని కార్మికులు స్పష్టం చేశారు.

కార్మికుల ఆర్థిక ప్రయోజనాల సాధనకు ఐక్య పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయడంలో ఉక్కు యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిని ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటిస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు అన్నారు. స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెయిల్‌లో జరిగిన వేతన ఒప్పందానికి స్థానిక యాజమాన్యం సాకులు చూపుతూ.. వేతనాలు అమలు చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కార్మికుల జీతభత్యాలకు కర్మాగార లాభనష్టాలతో సంబంధం ఏమిటని ప్రశ్నించారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాల సాధనకు ఐక్యంగా ప్రతిఘటిస్తామన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్య రామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షుడు వై.టి.దాస్ ప్రసంగించారు. కార్యక్రమంలో పి. శ్రీనివాసరాజు, కె. గంగాధర్, కె.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.